చంద్రముఖి

1

ప్రపంచసృష్టి ప్రారంభకాలంలో ప్రప్రథమ మానవుడు- మనస్వి- ఆనాటి భూలోక సౌందర్యం చూచి విభ్రాంతుడై ముగ్ధుడైనాడు. ప్రపంచంలో ప్రతి స్వల్పవిషయమూ అతని కత్యాశ్చర్యకరంగా భాసించింది. ఆకాశంలో పక్షులు బారులు తీరి ఎగిరిపోతూంటే అత డెంతో వింతగా వాటివైపే చూస్తూ ఉండేవాడు. కొండకాలవలు క్రేళ్లురుకుతూ ప్రవహిస్తూంటే వాటితో కలిసి పరుగులు పెట్టేవాడు. నెమళ్ళు గుంపులు గుంపులుగా పురివిప్పి ఆడుతూంటే వాటితో కలిసి నృత్యం చేసేవాడు.

అడివిలో చెట్లకింద ఒత్తుగా రాలిపడిన తియ్యతియ్యని పళ్ళు తిని, కొండకాలవలో ప్రవహించే చల్లచల్లని నీళ్ళు తాగి, పర్వతగుహాలలో హాయిగా పడుకుని నిద్రపోయే మనస్వి మహారణ్యజీవితం కొంతకాలంపాటే లోటూ లేకుండా సుఖంగా సాగిపోయింది.

మరికొంతకాలానికి మనస్వికి తనవంటి మానవు లా అరణ్యంలో ఇంకా ఎవరైనా ఉన్నారా అన్న జిజ్ఞాస బయలుదేరింది. అత డా అరణ్యంలో గుహాలు, చెట్లు, పుట్టలూ అన్నీ గాలించి చూశాడు. ఎక్కడా ఇంకొక మానవుని జాడే పొడగట్టలేదు. మనస్వి మనస్సులో క్రమంగా

ఒంటరితనము, నిస్పృహ, దిగులు ప్రారంభమయినాయి. ఒక మృగం లాంటి మృగా లా అరణ్యంలో కోకొల్లలుగా కనిపించాయి. కాని తనవంటి మానవు డెక్కడా మనస్వికి ప్రత్యక్షం కాలేదు. అయినా మనస్వి తన పట్టు విడిచిపెట్టలేదు.

ఆ మహారణ్యంలో దుర్గమమైన ప్రదేశాలన్నీ గాలించివేశాడు. ఒక గుహాగర్భంలో అతనికి రెండు నక్షత్రాలు భూమిమీదే మెరుసున్నట్లు కనిపించాయి. ఆ తారకాకాంతి చూడగానే అతని కెంతో ఆశ్చర్యం కలిగింది. వెంటనే ఆ ప్రదేశానికి చేరుకున్నాడు.

అక్కడ కూర్చున్నవాడు మనస్వివంటి మానవుడే! అతని కళ్లే చుక్కల్లా మెరిశాయి. కాని అతడు చాలా వృద్ధుడై పోయినట్లు కనిపించాడు. ఆ ముదుసలి అతన్ని చూస్తూనే లేచివచ్చి ఎంతో ఆప్యాయంగా ఆదరించాడు. మొట్టమొదటగా వారిద్దరిమధ్యా సంజ్ఞాధ్వని రూపంలో ఆవిర్భవించిన అన్యోన్యత క్రమక్రమంగా అత్యాశ్చర్యకరమైన మానవభాషగా అవతరించింది.

కొన్నాళ్ళకు వారిద్దరిమధ్యా అపూర్వమైన అన్యోన్యత ఏర్పడింది. ఆ వృద్ధు డతనికి తన నామధేయం 'సవిత' అని మాత్రమే తెలియజేశాడు. అంతేగాని మిగిలిన తన పుట్టుపూర్వోత్తరా లేవీ తెలియజేయలేదు. సవిత మనస్విని పుత్రవాత్సల్యంతో ఆదరించేవాడు. మనస్వికి కూడా సవితపై పితృగౌరవం కలిగింది. ఆ నూతన బాంధవ్యంతో వారిద్దరూ మరికొంతకాలంపాటు చీకూ, చింతా లేకుండా సుఖంగా కాలం వెళ్ళబుచ్చుకొన్నారు.

మరికొంతకాలానికి ఆ మహారణ్యంలో వర్షాకాలం ప్రారంభమైంది. మనస్వి హృదయంలో మళ్ళీ విచిత్రమైన ఆవేదన బయలుదేరింది. నెమళ్ళు జంటలు జంటలుగా పురివిప్పి ఆడుతూంటే అతనికి కూడా ఆడనెమలి వంటి 'మనిషి'తో కలిసి ఆ అరణ్యంలో హాయిగా నృత్యం చేస్తూ సంచరించాలని బుద్ధిపుట్టింది. అప్పటినించీ అతనిలోని ఆవేదన మరింత తీవ్రంగా విజృంభించింది. మొట్టమొదటగా ఆ రాత్రే అతనికి నిద్రపట్టక పోవడం అంటే ఏమిటో తెలిసివచ్చింది. క్రమక్రమంగా

ఆహారంమీద కూడా అరుచి బయలుదేరింది. సవిత ఒకనాటి ఉదయం అతని అస్వాస్థ్యానికి కారణ మేమని అడిగాడు.

"ఏమో మరి! రోజు రోజూ నాలో ఏదో పెద్ద అఘాతం ఏర్పడి పోతున్నట్లుంది."

సవిత కొంచెం ఆలోచించి మళ్ళీ అడిగాడు: "ఎందుచేత?"

"ఏమో!"

ఇంకా బాగా దిగాలు పడిపోయాడు మనస్వి. ఆనాటి సాయం కాలంవరకూ మరి ఆహార పానీయా లేవీ ముట్టలేదు. అలాగే దిగాలుపడి మతిపోయినట్లయి హాయిగా పురివిప్పి ఆడుతనే నెమళ్ళ జంటలకేసి చూస్తూ కూర్చున్నాడు.

అంతలో సూర్యాస్తమయం అయింది. సెలయేళ్ళలో కొండ మల్లెపూవులూ, నక్షత్రాలూ కలిసి మెలిసి ప్రవహించాయి. ఆకాశంలో మబ్బులపై మెరుపులు పురివిప్పి ఆడే నెమళ్ళలా నృత్యంచేశాయి.

చిటపటమని చిన్న చిన్న చినుకులు పడ్డాయి. మనస్వి చెక్కిళ్ళపై కన్నీటి బిందువులు నెమ్మది నెమ్మదిగా దిగజారాయి. సవిత హృదయంలో మనస్విని గురించిన ఆందోళన, కరుణ కొండకాలవలై ప్రవహించాయి. అతడు నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ మనస్వి దగ్గిరికి వచ్చి అతని వీపు తట్టాడు. మబ్బుల తెరలు చీల్చుకుని సన్నని పిల్లకాలవలా ప్రవహించిన వెన్నెలరేక మనస్వి పాదాలదాకా పాకి వచ్చింది. ఊరు మొకటి మంద మందంగా మహారణ్యంలోని కొండ చరియలలో మారుమోగింది. తటాలున మెరుపు మెరిసింది. క్షణ కాలం అది మనస్వి కళ్ళకు మిరుమిట్లు గొలిపింది. దానితో అతని ముఖం కొంచెం వికసించింది. సవిత ఆ అదను కనిపెట్టి అతని నోదార్చాడు:

"మనస్వీ! ఎందు కంతగా అధైర్యపడిపోతావు! అదిగో నీ కెదురుగా ఒక చక్కని చుక్క నిలబడింది చూడు!"

అని వేలెత్తి వారి కనతిదూరంలో నిలబడిన ఒక సుందరీమూర్తిని చూపించాడు. మొట్టమొదట మనస్వి ఆకాశంలో తళతళా మెరిసి

పోయే ఒక చక్కని చుక్కే తన కెదురుగా వచ్చి నిలబడిందని అనుకొన్నాడు. ఆ మూర్తి చక్కని 'చుక్క' కాదు. చుక్కవంటి ఒక మనోహర మానవమూర్తి!

2

అటువంటి మనోజ్ఞ మానవమూర్తిని మనస్వి అంతవర కెన్నడూ చూచి ఉండలేదు. అందుచేత ఇంచుమించుగా ఒక అరగడియవరకూ అలాగే విస్తుపోయి ఆమెవైపే చూస్తూ కూర్చుండిపోయాడు.

ఆమె ముఖం పున్నమినాటి చంద్రబింబం అచ్చంగా భూమిమీదికి దిగివచ్చినట్లే కనిపించింది. లేళ్ళ కళ్ళే ఆమెకళ్ళుగా మారి పోయాయనిపించాయి. ఆమె చూపులు కొండ కాలవలలో తళతళలాడే చిన్న చిన్న మీనుల్లా మెరిసి పోయాయి. చల్ల చల్లని పిల్ల గాలికి చలించిపోయే కొండమల్లెతీగే ఆమె శరీరమై తన కెదురుగా నిలిచిందని మనస్వి నిశ్చయించుకొన్నాడు. మొట్టమొదటి చూపులో అతడు నెమలి పింఛమే ఆమె తన శిరస్సుపై అలంకరించుకొన్నదని భ్రమించాడు. కాని అది నిజంకాదనీ, అది ఆమె తలకట్టేననీ ఆతరవాత నిర్ణయించుకొన్నాడు. ఒక్క విషయం మాత్రం అతనికి విస్పష్టంగా అవగాహన కాలేదు. ఆమె బాగా పరిపక్వమైన చూతఫలాలు రెండు ఎంతో జాగ్రత్తగా హృదయం దగ్గర దాచుకొన్నదని అతని అనుమానం! ఎంత సేపటికీ అతని కా అనుమానం తీరలేదు! అసలా వ్యక్తి ఎవ్వరోకూడా అతనికి తెలియలేదు! సవిత అతనితో అప్పుడప్పుడు దేవతామూర్తులనుగురించి ప్రసంగించేవాడు. మొట్టమొదట ఆమె అలాంటి దేవతామూర్తే కావచ్చునని అనుకొన్నాడు. కాని మనస్సులో సంశయం ఇంకా అలాగే పట్టుకుని పీడించింది. తొందర తొందరగా సవిత సన్నిధికి వెళ్ళి అతని చెవిలో ఊదాడు :

"ఈ సుందరవ్యక్తి ఎవ్వరు? ఎవరైనా దేవతా?"

"కాదు!"

"రాక్షసుడా?"

"కాదు!"

"మరి?"

"మనుష్య స్త్రీ!"

"అంటే!"

"ఆడు నెమలిని, మగ నెమలిని చూచావు కదా? మగ నెమలికి ఆడ నెమలి ఎలాగో నీ కామె అలాంటి దన్నమాట!"

మనస్వి మరింతగా విస్తుపోయాడు:

"ఇలాంటి వ్యక్తిని నే నెన్నడూ చూడలేదే! ఎంతటి అత్యద్భుత సుందర వ్యక్తి!"

"ఆమె సృష్టి అత్యాశ్చర్యకరం! ప్రపంచంలో అందమైన వస్తువులన్నీ తమ అందం ఆమె కిచ్చాయి. అంతేకాదు. ప్రపంచంలో పరమాద్భుతాలన్నీ ఆమెలో మూర్తీభవించాయి! ఇకనించీ ఆమె నీకు సహధర్మచారిణి!"

ఆమాట మనస్వి కేమీ బోధపడలేదు. వెంటనే అడిగాడు:

"అంటే?"

సవిత అతని కా మాట అర్థం కొంతవరకు వివరించి చెప్పాడు:

"ఇకనించీ ఆమె నీతో కలిసి మెలిసి తిరుగుతూ తోడునీడలా సంచరిస్తుంది. ఈ క్షణంనించీ నీలోని ఒంటరితనం అంతా పటాపంచలై పోతుంది. ఇకనించీ మీరిద్దరూ సింహాల జంటలలాగ ఈ అరణ్యం అంతా ఏలుకుంటూ, పావురాల జంటల్లాగ కలిసిమెలిసి సంచరించండి! నెమళ్ళ జంటల్లా కలిసి మెలిసి వినోదించండి! వెళ్ళు నాయనా! వెళ్ళు! ఆమెను నీ వెంట తోడుకుపో!"

ఎంతో వాత్సల్యంతో అతని కుపదేశించాడు.

ఆ క్షణంలో మనస్వి మనస్సులోని ఆవేదన అంతా తెల్లవారేవేళ చిమ్మచీకటిలా పటాపంచలయి పోయింది. అయినా, ఆమె నేమని పిలవాలో అతనికి తెలియలేదు.

"ఆమె పేరు?"

"చంద్రముఖి!"

అని, సవిత, నెమ్మదిగా లేచి తన నివాసానికి తిరిగి వెళ్ళిపోయాడు.

మనస్వి ఆకల్లాడకుండా అడుగుల్లో అడుగులు వేసుకుంటూ చంద్రముఖిని సమీపించాడు! ఆమె శరీరంమీది పాముకుబుసంవంటి పట్టువస్త్రం చూడగానే అది పామేమోనని మొట్టమొదట అతనికి కొంచెం భయంవేసింది. ఆమెకు ఇంకా సమీపంగా వెళ్ళి నిలబడగానే అతని భయం కాస్తా అంతరించిపోయింది. అలాగే అత్యాశ్చర్యంగా ఆమెవైపు చూస్తూ నిలబడ్డాడు. కొంత సేపటికతనికా సౌందర్య మూర్తి పెదవులు ముద్దుపెట్టుకోవాలనీ, ఆమె పుట్టు పూర్వోత్తరాలన్నీ ఆప్యాయంగా అడిగి తెలుసుకోవాలనీ అనిపించింది.

మనస్వి సాయంకాల సూర్యకిరణాలలా మెరిసిపోయే చంద్రముఖి పెదవులు ముద్దు పెట్టుకోబోయాడు. తటాలున, ఆమె, ముఖం పక్కకి తిప్పివేసింది. అతడు తిరిగి ప్రయత్నించాడు. కాని ఈమారు కూడా అది సాధ్యపడనీయలేదు. ఆమెను తన కౌగిలిలో బంధిస్తే అది సాధ్య పడగలదని తోచింది. వెంటనే గాఢంగా కౌగిలించుకొన్నాడు. మరు క్షణంలోనే ఆమె అతని కౌగిలి పట్టు తప్పించుకొని చెంగున ఒక్క గంతువేసి లేడిపిల్లలా అరణ్యంలోకి పారిపోయింది!

3

అయినా మనస్వి ఆమె నంతటితో విడిచిపెట్టలేదు. ఎలాగైనా చేజిక్కించుకొని తీరాలని వెంటబడ్డాడు. చంద్రముఖి అతని కంద కుండా అతివేగంగా కొండలలోను, కోనలలోను పరుగులు పెట్టింది. మనస్వి తీవ్రవేగంతో పరుగులు పెట్టే లేళ్లు మొదలయిన మృగాల నెన్నిటినో వెంటదరిమి చేజిక్కించుకొన్నాడు. 'ఆమె పరు గొక లెక్కా!' అని అహంకరించాడు. మరింత వేగంగా ఆమెవెంటబడి పరిగెత్తాడు.

చూస్తూండగానే చంద్రముఖి ఒక మర్రిచెట్టు మాటున ఇట్టే అదృశ్యమైపోయింది. అత డా ప్రాంతం అంతా గాలించాడు. ఆమె ఎక్కడా కనబడలేదు. దిగాలుపడిపోయి, ఉసూరుమని నిట్టూర్చి

మర్రిచెట్టునీడలో కూలబడిపోయాడు! అంతలో చంద్రముఖి హఠాత్తుగా అతని కళ్ళు రెండూ మూసింది. ఆ తరవాత మరి అతని పట్టు తప్పించుకోలేకపోయింది!

ఆనాటినుంచీ వారిద్దరూ వెలుగునీడల్లా ఒక రొకరిని విడిచి పెట్టకుండా వెంటనంటి తిరిగేవారు.

క్రమంగా కొంతకాలం గడిచిపోయేసరికి వారిద్దరూ ఒక విడరాని జంటగా మారిపోయారు. మరికొంత కాలానికి మనస్వి మరి సవిత మాటే మరిచిపోయాడు. అతనికి చంద్రముఖే సమస్త ప్రపంచమూ అయికూర్చుంది. ఒక నాడతడామెను గుచ్చి కౌగలించుకొని చెక్కిలిముద్దు పెట్టుకుంటూ అడిగాడు:

"చంద్రముఖీ! నీతో చెలిమి చేసినప్పటినించీ నా జీవితం అంతా ఒక మహోత్సవంగా, ఒక మృగయావినోదంలా సాగిపోతూంది. నీ వెవరవు? ఇక్కడికి కెలా వచ్చావు?"

నెమ్మదిగా ఆమె పుట్టు పూర్వోత్తరా లన్నీ అడగటం మొదలు పెట్టాడు. చంద్రముఖి అతని ప్రశ్నలు విని పక్కుమని నవ్వింది:

"ముందు నీ మాట చెప్పు! ఎక్కడనించి వచ్చావు?"

"నే నెక్కడినించీ రాలేదు! చాలాకాలంనించి ఇక్కడే ఉంటున్నాను."

"నేనూ అంతే."

"అయితే నీవిక్కడ ఉన్న విషయం హఠాత్తుగా సవిత కెలా తెలిసింది?"

"నేనే ఆయన్ని ఒక గుహలో కనుక్కొన్నాను! అంతేగాని ఆయన నన్ను కనుక్కోలేదు!"

"నేను నిన్నూ, ఆయన్నీ ఒక్కమారే చూచాను. అంతే! అయినా హాయిగా అడవిలో పుట్టతేనె ఆరగించే వేళ ఈ అనవసర ప్రసంగాలన్నీ ఎందుకు? రా, పోదాం."

అని చంద్రముఖి అతని నింక మళ్ళీ మాట్లాడనీయకుండా వెంటనే తనవెంట తోడుకుపోయింది. మనస్వి మారుమాట చెప్పకుండా ఆమె వెనకాలేపడి అడివిలోకి వెళ్ళిపోయాడు. అప్పటినుంచి వారిద్దరూ ప్రప్రథమంగా మానవలోకంలో అవతరించిన మనుష్యదంపతుల అమాయికానంద మాధుర్యం అంతా కొల్లగొన్నారు. వారిద్దరినీ చూచిన మృగపక్షి మిథునాలన్నీ ఆ జంట ఆనందానికి ప్రతిబింబాలుగా మారిపోయాయి. మొట్టమొదటగా మనస్వి ఆమె కౌగిలింతలోనే కలలు కనడం నేర్చుకొన్నాడు. అంతవరకూ అతనికి కల అంటే ఏమో తెలియనే తెలియదు! ఆలా కొన్ని నెలలు గడిచిపోయాయి.

ఆ అపూర్వానందం చవిచూచినకొద్దీ మనస్వి కా ఆనందమాధుర్యం అంతా ఎప్పుడో ఒకప్పుడు కల కరిగిపోయినట్లు కరిగిపోతుందేమోనని భయంవేసింది. ఆ మాటే ఒకసారి ఆమెతో అన్నాడు. అది వింటూనే చంద్రముఖి రుసరుసలాడింది. ''ఎప్పుడూ ఏవో లేనిపోనిమాటలతోనే కాలక్షేపం చేస్తావు. నీకేం! నే నడివిలోకి వెళ్ళి నీకు పుట్టతేనే, పళ్ళూ తీసుకురావాలి! నన్ను వెళ్ళనీ!''

అని, ఆపైని అతడు చెప్పేమాట తిన్నగా వినిపించుకోకుండా తురుల్రున అక్కడినించి పరుగెత్తుకుపోయింది. ఆ నాటి రాత్రి గూళ్ళల్లో పక్షులన్నీ నిద్రపోయేదాకా ఆమె అతని దగ్గరికి తిరిగి రాలేదు. అనుక్షణమూ చంద్రముఖి రాకకోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూచిచూచి విసిగి వేసారిన మనస్వి ఆమెను చూస్తూనే మండిపడ్డాడు: ''ఇంతరాత్రి దాకా ఏంజేస్తున్నావు? ఏ పెద్దపులి అయినా హఠాత్తుగా నిన్ను నోట బెట్టుకుపోతేనో?''

''ఇన్నాళ్లనుంచీ నన్ను నీవే రక్షించావా? నాకేమీ భయం లేదులే!''

ఆ మాటతో మనస్విమనస్సు భగ్గున మండింది:

''నీకేం, నువ్విలాగే మాట్లాడతావు! ఏదైనా ఆపదు వస్తే మధ్యన యాతన అనుభవించేవాణ్ణి నేను! నీవు రేపటినించీ ఒక్కత్తైవు అడివిలోకి వెళ్ళడానికి వీల్లేదు! తెలిసిందా?''

మనస్వి ఆమెమీద గుడ్లెర్రజేశాడు. చంద్రముఖి మరింత మండి పడింది:

"నన్నాజ్ఞాపించడానికి నీ వెవరవు? నేను వెళ్ళితీరతాను! చూచుకో!"

"వెళ్ళడానికి వీల్లేదు! గుహదాటి ఎక్కడికైనా కదిలిచూడు! నిన్నేం జేస్తానో!"

అని మనస్వి ఆమెను మరింత గట్టిగా బెదిరించాడు. చంద్రముఖి అతని కేమాత్రమూ తీసిపోలేదు:

"అయితే నీ పుట్టతేనె, పళ్ళూ నీవే తెచ్చుకో! ఈ వేళనించీ నే నవి తీసుకురా నేరాను! తెలిసిందా?"

ఆపైన అతని కేసి చూసి, పట్టరాని ఉడుకుబోతుతనంతో బుడిబుడి దీర్ఘాలు తియ్యడం మొదలుపెట్టింది. అలా కొంతసేపు బుడిబుడి దీర్ఘాలు తీసి రుసరుసలాడుతూ అక్కడినించి వెళ్ళిపోయింది.

మనస్వి కామె రాగాలు తియ్యడం మొదలుపెడితే మరి నోట మాట పెగలదు. అతడు పెద్ద పెద్ద ఆడపులుల నెన్నిటినో రెండు చెవులూ గట్టిగా పట్టుకుని క్షణంలో లొంగదీశాడు. కాని చంద్రముఖిని బాగా మచ్చిక చెయ్యడంమాత్రిం అతనికి సాధ్యపడలేదు.

అప్పటినించీ వారిద్దరిమధ్యా కస్సు బుస్సు లెక్కువైపోయాయి. మనస్వి ఏదిచెప్పినా ఆమె దానికి అడ్డంగా సమాధానం చెబుతుంది. అతడు పుట్టతేనెకోసం బయలుదేరదామంటే ఆమె పళ్ళకోసం బయలు దేరదా మంటుంది. కొంచెం గట్టిగా కసిరితే రాగాలు మొదలు పెడు తుంది. వారిద్దరిమధ్యా బయలుదేరిన చిలిపి కజ్జాలు క్రమంగా చిలికి చిలికి గాలివానలుగా మారిపోయాయి. చివరికి మరి కొంతకాలానికి వారిద్దరిమధ్యా పచ్చగడ్డి వేసినా భగ్గుమని మండింది.

"సుఖంగా అడవిలో ఆకూ, అలమూ తిని తిరిగేవాడికి నా కీ వల్లిమాలిన గుదిబండ దాపురించిందే!"

అని తన దురదృష్టాని కెంతో విచారించాడు. ఎలాగయినా మరి ఆమె కంటికి కనబడకుండా తప్పించుకు తిరగాలని అనుకున్నాడు. కాని ఆ మరునా డెలాగైనా ఆమె నొకమారు చూడకపోతే అతని కంటి కిక కునుకే పట్టేదికాదు!

కాని ఆ మరునాడుదయమే అత డామె కంటికి కనిపించకుండా ఒక కీకారణ్యంలోకి వెళ్ళిపోయాడు.

"అమ్మయ్య! ఇక ఇప్పటినించీ నాకు చంద్రముఖి పీడ వదిలి పోయింది!"

అని ఎగిరి గంతేశాడు. కాని ఎక్కడినించి వచ్చిందో చంద్రముఖి వెనకాలే వచ్చి అతని మెడచుట్టు వాటేసింది :

"నన్ను తప్పించుకుని పారిపోదామని అనుకున్నావా? నీ వెక్కడికి వెళ్ళిందీ నేను కనిపెట్టలేననుకున్నావా? నే నిక్కడే పుట్టి పెరిగాను- నీ వెక్కడ ఉన్నదీ పట్టుకోలేననుకొన్నావా?"

అని కలకల నవ్వడం మొదలుపెట్టింది. మనస్వి ఆమె చాకచక్యాని కెంతైనా సంతోషించాడు. ఇద్దరూ కలిసి మళ్ళీ అడివిలో లేళ్ళజంటలా విహరించారు.

అంతలోనే చంద్రముఖి మళ్ళీ అతనితో చిలిపి కజ్జాలు మొదలు పెట్టింది. క్రమంగా అతన్ని పొద్దస్తమానమూ పుండు సలిపినట్లు సలపడం మొదలుపెట్టింది. దానితో మనస్వి హృదయంలోని సహనశక్తి అంతా నశించిపోయింది. ఆమె నెలాగయినా సరే వదిలించుకు తీరాలని ఒక దృఢ నిశ్చయానికి వచ్చివేశాడు.

4

ఆ క్షణంలోనే అతనికి సవిత సంగతి జ్ఞాపకము వచ్చింది. అతని నెలాగయినా ఆ అరణ్యమంతా గాలించి పట్టుకోవాలనీ, అతని చంద్రముఖిని తిరిగీ అతనికి అప్పగించివేసి హాయిగా అడవిలో వేటకు వెళ్ళిపోవాలనీ అనుకొన్నాడు.

అతి కష్టంమీద పగలంతా ఆ మహారణ్యం అంతా వెతికి సాయం కాలంవేళ సవితని ఒక గుహలో పట్టుకున్నాడు. వెంటనే అతని పాదాల మీద సాగిలపడ్డాడు. సవిత అతని యోగ క్షేమాల విషయం అడగనే లేదు. పైగా చంద్రముఖి మాటే ముందుగా ప్రసంగించాడు:

"చంద్రముఖి ఏదీ?"

"ఏమో! ఎక్కడికి వెళ్ళిందో తెలియదు. స్వామీ! ఆమె నా మాట బొత్తిగా వినిపించుకోవడమే మానివేసింది."

మనస్వి గుక్క తిప్పుకోకుండా ఆమెకూ, తనకూ మధ్య నడిచిన వ్యవహారం అంతా సవిస్తరంగా విన్నవించాడు. సవిత అదంతా అతి శ్రద్ధగా ఆలకించాడు:

"అయ్యో! పాపం! ఏ పాపమూ ఎరగని అమాయకురాలామె. ఇప్పుడీ అడివిలో ఎక్కడ ఏమి ఇబ్బందులు పడుతూందో!"

సవిత ఒక్క వేడి నిట్టూర్పు విడిచి పెట్టాడు. అప్పటికి మనస్వి తాను తొందరపడ్డానేమో అని కొంచెం పశ్చాత్తాపపడ్డాడు. అంతలోనే సవిత అందుకొన్నాడు:

"నాయనా! చంద్రముఖి ఇంకా ముక్కుపచ్చలారని పసిపిల్ల! ఆమెవల్ల ఏదైనా ఒక చిన్న లోపమే జరిగిందనుకో! అంతమాత్రానికే నీ వింత తొందరపడాలా?"

సవిత మాటిమాటికీ చంద్రముఖినే వెనక వేసుకురావడంతో మనస్వి ప్రాణం విసిగిపోయింది:

"ఏమైనాసరే! నేనిక ఆమెతో ఒక్క క్షణంకూడా వేగలేను! ఆమె నన్ను పెట్టిన యమయాతనలు మీకేం తెలుసు! ఆమె కనక అడివిలో ఎక్కడైనా కనిపిస్తే ఇక తిన్నగా మీ దగ్గిరికే వెళ్ళిపొమ్మని చెప్పేస్తాను. ఇక మీ చంద్రముఖిని మీరే జాగ్రత్త చేసుకోండి!"

మనస్వి ఆపైన మరి సవిత ముఖం చూడలేక తలవంచుకొన్నాడు. సవిత సూటిగా అడిగాడు :

"మనస్వీ! నువ్వొక్కడవూ ఒంటరిగా బతకలేక భయపడినప్పుడే నీ కామెను తోడిచ్చాను! అప్పుడే ఆ మాట మరిచిపోయావా?"

"మరిచిపోలేదుగాని నా కిప్పుడామెకేసి కన్నెత్తి చూడడానికే భయంగా ఉంది. ఇప్పుడామె నా కొక ఈనిన పులిలా కనిపిస్తూంది!" అన్నాడు మనస్వి ఖండితంగా. ఆ మాటమీద సవిత సాధికారంగా గట్టిగా నవ్వాడు :

"వెర్రివాడా! ఆ చంద్రముఖి ఎవరో తెలియక నీవిలా మర్యాద అతిక్రమించి మాటాడుతున్నావు! ఆమె ఎవరో తెలుసునా! స్వర్గ లోకంలో దేవకన్యకే తిరిగి ఈ భూలోకంలో సాక్షాత్తూ చంద్రముఖిగా అవతరించింది! తెలిసిందా?"

మనస్వి హృదయం ఆ మాటలతో కొంచెం మెత్తబడింది. కొంచెం తటపటాయిస్తూ అడిగాడు :

"అయితే నే నెవరిని స్వామీ!"

సవిత పెదవిపై చిన్న చిరునవ్వు వెలిసింది :

"వెర్రివాడా! మీ రిద్దరూ పూర్వజన్మంలో స్వర్గ దేవతలే! కేవలం సుఖమయమైన స్వర్గలోకంమీద విరక్తికొద్దీ మీ రిద్దరూ సుఖదుఃఖ సమ్మేళనమయమయిన ఈ భూలోకంలో జన్మించారు. మీరే ఇక ఈ సృష్టి కంతటికీ ఆకాశ దీపాలు. తెలిసిందా?"

మనస్వి ఆ మాట విని తాను చేసిన పనికి బాగా నొచ్చుకున్నాడు. అంతలో అతని కామె మంకుపట్లు, రుసరుసలు, బుడిబుడి దీర్ఘాలు మొదలైనవన్నీ జ్ఞాపకం వచ్చాయి. వాటిని గురించి సవితతో ఏదో విన్నవించుకోవాలని అనుకున్నాడు. అంతలో కొంచెం తటపటాయించి మాట్లాడకూరుకున్నాడు. సవిత అతని జిజ్ఞాస గ్రహించాడు.

"మనస్వీ, ఈ అంధకార బంధురమైన సంసార మహారణ్యంలో నీ కిక బంధుమిత్రు లెవరున్నారు? ఈ అరణ్యయాత్రలో నీకు భుక్తిముక్తి ప్రదాయిని ఆ చంద్రముఖే! ఆమె చూపులే నీ కీ కీకారణ్యంలో వెలుగు దారులు చూపించగలవు! ఇక ఇప్పటినించి నీ వామె కనుసన్నలలో

కుసులుకో! ఆమె ఎప్పుడైనా కంట తడిపెట్టిందంటే ఇక నీ నట్టింట సిరి ఒక్క క్షణమైనా నిలవదు! తెలిసిందా? మీ కిద్దరికీ అచిరకాలంలోనే ఒక కుమారుడు కలుగుతాడు. ఆ పసివాణ్ణి దివ్యలోకంలోని దేవతలాగే పెంచి పెద్ద చెయ్యండి! వెళ్ళు నాయనా, వెళ్ళు!''

అంతలోనే చంద్రముఖి కలకల నవ్వుతూ హఠాత్తుగా అక్కడికి వచ్చి ''చూచావా? చివరికి నామాటే నెగ్గింది!'' అన్నట్లు మనస్వివైపు చూచింది. మళ్ళీ చంద్రముఖిని చూడగానే మనస్వి మనస్సానందంతో ఉరకలు వేసింది. ఇద్దరూ సవితకు పాదాభివందనం చేసి గుహ గుమ్మం దాటి కొంతదూరం ఇవతలికి వచ్చారు. మనస్వి ఎంతో ఆప్యాయంగా చంద్రముఖికేసి చూచాడు :

''విన్నావా? ఆయన చెప్పినమాట! ఇక్కడినించీ నీవు నాతో చిలిపికజ్జా లాడడానికి వీలులేదు! ఇకనించీ నేనూ నీమన స్సెప్పుడూ నొప్పించనులే!''

చంద్రముఖి బుంగమూతి పెట్టింది:

''అయితే ఇక అడివిలోకి వెళ్ళి పుట్టతేనె, అడివిపళ్ళూ నీవే తీసుకురావాలి. ఆ సవిత మనకోసం ఒక దేవతై వెలిశాడు. ఆయన మాట ఎప్పుడూ జవదాటకూడదు. తెలిసిందా?''

అంతలో మనస్వి కొక విషయం జ్ఞాపకం వచ్చింది. అతడు మొదట సవిత ఎవరో తెలుసుకోవాలని అనుకొన్నాడు. కాని హఠాత్తుగా చంద్రముఖి అక్కడికి రాగానే అతడా మాటే మరిచిపోయాడు. తీరా గుహగుమ్మం బాగా దాటి వచ్చిన తరవాతనే అతని కా విషయం జ్ఞాపకం వచ్చింది. తిరిగి వెంటనే లోపలికి వెళ్ళాడు.

కాని అతని కక్కడ సవిత కనబడలేదు! గుహ అంతా అంధకార బంధురంగా కనిపించింది. మనస్వి వెంటనే తిరిగివచ్చి ఆ అద్భుత వృత్తాంతం ఆమెకు తెలియజేశాడు :

''చంద్రముఖీ! ఆయన నిజంగా దేవతామూర్తే! సందేహంలేదు!''

వెంటనే చంద్రముఖి మనస్సులో ఆతనికి చెయ్యెత్తి నమస్కరించింది.

"నిన్ను, నన్ను, ఈ మహాప్రపంచాన్నీ సృష్టించిన సృష్టికర్త ఆయనే !" అన్నాడు మనస్వి.

తిరిగి ఇద్దరూ ఆ గుహాముఖంలో నిలబడి అతనికి చెయ్యెత్తి నమస్కరించారు.

అప్పటినించీ అడవిపళ్ళు, పుట్టతేనే తీసుకురావడం మనస్వి కొక అలవాటుగా మారిపోయింది. ఆ పళ్ళు పుట్టతేనెలో పొదిపి అతని కందించడం చంద్రముఖికి మహానంద దాయకంగా పరిణమించింది.

మనస్వి అడివిలో ఎన్ని కష్టాలుపడినా చంద్రముఖి ముఖస్మరణంలో అవన్నీ అతని కవి తీయతీయని కలలుగానే కనిపించాయి.